ప్రజాశక్తి

గురువారం 20 మార్చి 2025

5

అల్లూరి సీతారామరాజు

21, 22తేదీల్లో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి -పాడేరు: జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ , రెడ్ రిబ్బన్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 21న శుక్రవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి ఒక ప్రకటనలో తెలియజేశారు.యువతీ యువకులు రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేయాలని వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పిఎన్ రసూల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జానకిరామ్, జి.గౌరీ శంకర్రావు, అచ్యుత్ పాల్గొన్నారు.

జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో ఔత్సాహికులైన యువతీ యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరాలు 21వ తేదీ శుక్రవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 22వ తేదీన శనివారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కాఫీ కార్మికుల క్వార్టర్స్ మరమ్మతు చేయాలి

▸▸సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స ▸▸పలు గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

మినుములూరు కాఫీ కాలనీలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు:కాఫీ కార్మికుల క్వార్టర్స్‌ను తక్షణమే మరమ్మతు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి అప్పలనరస రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బుధవారం పాడేరు మండలం మినుములూరు పంచాయతీ పరిధి కాఫీ కాలనీలో కొనసాగింది.ఈ సందర్భంగా. అప్పలనర్సకు కాఫీ కార్మికులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు ఏపీ ఎఫ్డిసి నిర్మించిన క్వార్టర్స్ మరమ్మతుకు గురైందని, వర్షం వచ్చినప్పుడు కారిపోతుందని, పరిసరాల్లో నిత్యం సంచరిస్తున్న విష సర్పాలతో కార్మికులు సహజీవనం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కనీసం తాగడానికి మంచినీరు కూడా అందించలేదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కాఫీ కార్మికులకు నూతనంగా నివాస గృహాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాఫీ కార్మికులకు పెరిగిన ధరలు కనుగుణంగా కూలి సొమ్ము చెల్లించలేదని, కాఫీ బోర్డులో పని చేస్తున్న కాఫీ కార్మికులకు రోజుకు రూ.342 చెల్లిస్తుంటే ఏపీ అటవీ శాఖ మాత్రం రూ.321 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కాఫీ కార్మికుల పనిలో వ్యత్యాసం లేదని, కానీ ఏపీ అటవీ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాఫీ కార్మికులతో వెట్టి చాకిరి చేసిస్తున్నారని విమర్శించారు. కూలి రేట్లు పెంచుతామని హామీ ఇచ్చిన యాజమాన్యం నేటికీ పెంచలేదన్నారు. క్షేత్రస్థాయిలో కాఫీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేస్త్రిలు నియమిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఆరు నెలలు కావస్తున్నా కనీసం స్పందించ లేదన్నారు. ఏపీఎఫ్‌డిసి కార్మికుల మంచి చెడ్డలు పట్టించుకోలేదని, మినుములూరు పంచాయతీ కూడా ఏపీ అటవీ శాఖపై నెట్టేసి చేతులు దులుపు కున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎల్.సుందర్రావు, జిల్లా కమిటీ సభ్యులు వంతల దాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పిఎం జన్ మన్ ఇళ్లకు రూ.10 లక్షలు ఇవ్వాలి

ముంచంగిపుట్టు : పిఎం జన్ మన్ ఇళ్లకు రూ.10 లక్షలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా లక్ష్మీపురం సచివాలయం ఎదుట గృహ లబ్ధిదారులతో నిరసనను ఆ పార్టీ కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులందరినీ గృహాలు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సిమెంటు, స్టీల్,ఇసుక, ఇటుక , ఇతర నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తి అవుతున్నా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వలేదన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయక నూతన దంపతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాలేదన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామాల్లో సర్వే చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం సచివాలయం స్థాయిలో నిరసన కార్యక్రమం చేస్తున్నామని, అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.నీలకంఠం, టీ.గణపతి, వార్డు, పీసా సభ్యులు కె.పోడ్నో, జీ.కొములైచొన్, కె.నాగరాజు, రాజేంద్ర, తిరుపతి పంతులు పాల్గొన్నారు.

అరకులోయలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నేత జయ

ముంచంగిపుట్టులో నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

అరకులోయ రూరల్:సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం అరకులోయ మండలం గన్నెల పంచాయతీ పరిధి గ్రామాలైన చీడివలసలో నాయకులు పర్యటించారు. గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి జయ, నాయకుడు పి.రామన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివి జయ మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేసి అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తాగునీరు, పోడు పట్టాల సమస్య తీవ్రంగా ఉందని అధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిసి రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుండంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిపిఎం మండల పంచాయతి నాయకులు ఓ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు రుణాలు

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు, : మహిళా కాఫీ రైతులందరూ కాఫీ పండ్లను పల్పింగ్ చేసి పార్చ్‌మెంట్ అమ్మడం ద్వారా అత్యధిక లబ్ది పొందాలని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మినుములూరులో కాఫీ రైతులతో డిఆర్‌డిఎ, కాఫీ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన శిక్షణలను డిఆర్‌డిఎ అందించాలని, కాఫీ గింజలు ఆరబెట్టడం, పార్చ్‌మెంట్ తదితర అంశాలపై కాఫీ బోర్డ్ శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా మట్టి నేలపై, పేడతో అలికిన నేలపై గింజలను ఆరబెట్టడం ద్వారా కాఫీ నాణ్యత తగ్గడమే కాకుండా ధర కూడా తక్కువకు వస్తుందని, డ్రైయింగ్ యార్డ్ లో ఆరబెట్టడంతో నాణ్యత బాగుండడమే కాకుండా అధిక రేటు వస్తుందని కలెక్టర్ వివరించారు. పల్పింగ్ యూనిట్లు వినియోగించి పార్చ్‌మెంట్ చేయడం ద్వారా మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా పాడేరు డివిజన్ కొయ్యూరు మినహా మిగిలిన పది మండలాలకు చెందిన 425 మంది మహిళా కాఫీ రైతులకు డ్రైయింగ్ యూనిట్, పల్పర్, 30 అడుగుల నిచ్చెన, టార్పాలిన్ కొనుగోలుకు రూ. 4,99,37,500లు యూనియన్ బ్యాంక్ ద్వారా మంజూరు చేసిన రుణం చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.కాఫీ బోర్డ్ నుండి 50 శాతం సబ్సిడీ ఉంటుందని, అదేవిధంగా పిఎం ఎఫ్ ఎం ఎఫ్ పి (ప్రధానమంత్రి ఫార్మర్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్) ద్వారా 35 శాతం మొత్తం 85 శాతం సబ్సిడీ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, కాఫీ బోర్డ్ డైరెక్టర్ డిడి మురళీకృష్ణ, ఎడి రమేష్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, డిఆర్డిఎ పిడి వి. మురళి, పిఎంఎఫ్ఎంఎఫ్ పి ప్రతినిధి శ్రీనివాస్, స్థానిక సర్పంచ్, ఎంపిటి సి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సిపిఎమ్‌ను విమర్శించే అర్హత ఎవరికీ లేదు

ప్రజాశక్తి-ఎటపాక

సిపిఎం మండల కార్యదర్శి కాక అర్జున్ దొర

సిపిఎంను విమర్శించే అర్హత కిరాయికి బూర్జువా పార్టీల జెండాలు మోసే వారికి లేదని సిపిఎం మండల కార్యదర్శి కాక అర్జున్ దొర పేర్కొన్నారు. సిపిఎంను, పార్టీ ప్రజాప్రతినిధులను, ఆదివాసీ గిరిజన సంఘాన్ని విమర్శిస్తూ కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై అర్జున్ దొర బుధవారం తీవ్రంగా స్పందించారు. ఇళ్ల స్థలాల పోరాటం పేరుతో బెదిరింపులకు పాల్పడి రెండు ఎకరాల భూమిని రాయించుకొని ప్లాట్లు చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వారు, ఎటపాక అక్షయ ఫంక్షన్ హాల్ యజమాని నుంచి రూ.60 లక్షలు వసూలు చేసిన వారు నేడు సిపిఎంను, పార్టీ ప్రజా ప్రతినిధులను విమర్శిస్తున్నారని తెలిపారు. రోజుకో పార్టీ, పూటకో సంఘం పేరు చెప్పుకునే వారికి సిపిఎంను విమర్శించే అర్హత లేదని పేర్కొన్నారు. నిత్యం ప్రజా ఉద్యమాలతో తాడిత, పీడిత, కార్మిక, కర్షక, బడుగు జీవుల హక్కులకై రాజీలేని పోరాటం చేస్తున్న సిపిఎం మీద విమర్శలు చేయడం హేయమన్నారు. జిఒ నెంబర్ 3 రద్దుపై పాలక పార్టీలు కనీసం రివ్యూ పిటిషన్ వేయలేదన్నారు. ఆదివాసీ హక్కుల కోసం ఏర్పాటు చేసిన ఉమ్మడి వేదిక జెఎసిని కొంతమంది బతకడానికి వేదికగా మార్చుకున్నారని, టిడిపి, బిజెపి, వైసిపి, జనసేన పార్టీల ముసుగు ధరించి ఉమ్మడి వేదికలను సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. వారికి ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నిర్వీర్యమవుతున్న ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం సిపిఎం ప్రజా ప్రతినిధులు మిడియం బాబూరావు, సున్నం రాజయ్య జనాల్లోనూ, చట్ట సభల్లోనూ ఎలా కొట్లాడారో చరిత్ర తెలుసుకోవాలని హితవుపలికారు. జాతి హక్కులు నిర్వీర్యముపుతున్నా ఏనాడూ మాట్లాడని వారు సిపిఎంపై చేసే చౌకబారు ఆరోపణలను జనాలు నమ్మే స్థితిలో లేరని, ఇకనైనా విచక్షణతో ప్రవర్తించాలని హితవుపలికారు.

ఒట్టిగెడ్డ గ్రామంలో విచారణ చేపడుతున్న వెలుగు అధికారులు

బ్యాంకు రుణాల్లో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బ్యాంకు రుణాల్లో జరిగిన అవకతవకలపై ఒట్టిగెడ్డ డ్వాక్రా మహిళలు వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టిన నేపథ్యంలో గురువారం వెలుగు అధికారులు ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. మండలంలోని తంటికొండ పంచాయితీ ఒట్టిగెడ్డ గ్రామానికి చెందిన 15 డ్వాక్రా సంఘాల సభ్యులు అనుమతులు, వారికి ఎటువంటి సమాచారం లేకుండా రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు ద్వారా సుమారు రూ2.63కోట్ల డ్వాక్రా రుణాలు మంజూరు చేసి, ఆ సొమ్మును వారి ఖాతాల నుండి తిరిగి బ్యాంకు వారే తీసుకున్నారంటూ ఒట్టిగెడ్డ గ్రామానికి చెందిన కావేరి, సంధ్య, వనిత, దివ్య, ప్రియదర్శిని, రమ్య, సాయి తదితర గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు విచారణలో తెలియజేశారు. దీనివలన రూ.51 వేలు వడ్డీ కట్టాలని బ్యాంకు నుండి సమాచారం వచ్చిందని చెప్పారు. ఎవరో చేసిన తప్పుకు తాము ఎందుకు వడ్డీ కట్టాలని అధికారులను నిరదీశారు. బ్యాంకు ద్వారా అవకతవకలు జరిగినట్లు గుర్తించామని నివేదికలు ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని వెలుగు ఏపిఎం రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, ఎంఎంఎస్ లీడర్లు, వివోఏలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌ను ఇస్తున్న ఎస్‌పి

మహిళలకు కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

-జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గిరిజన ప్రాంతంలో మహిళలు కుట్టు మిషన్ శిక్షణతో స్వయం ఉపాధిని పొందవచ్చని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ చెప్పారు. మండల కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో కృషి టెక్నోసాఫ్ట్ సొల్యూషన్, దండకారణ్య ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పాడేరు ఏజెన్సీ 11 మండలానికి చెందిన గిరిజన మహిళలకు సుమారు 15 రోజులు రోజులపాటు సుమారు 115 మంది ఉచిత కుట్టు మిషన్ ఉచిత శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ ముగియడంతో బుదవారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ముఖ్య అతిథిగా హాజరైన అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్, డిఎస్పీ షేక్ షేక్ షాహబాజ్ అహ్మద్, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి పి రోహిణి కలిసి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో వారపు సంతలు ప్రతీ మండలంలో జరుగుతుంటాయని, ఇక్కడ కుట్టు మిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, శిక్షణ పొందిన మహిళలు ఎవరైనా అక్కడకు వచ్చి బట్టలు కుట్టుకోవచ్చని తెలిపారు.గిరిజన మహిళలకు నైపుణ్యం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమాగిరి, ఎస్ఐ గోపాలరావు, కృషి టెక్నో సాఫ్ట్ సొల్యూషన్ ప్రతీనిధి చైతన్య, దండకారణ్య కరస్పాండెంట్ శ్రీనువాసు, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రోత్సాహంతోనే భూ ఆక్రమణలు

-ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో ఆక్రమణ దారులతో రెవెన్యు అధికారులు లోపాయికార ఒప్పందం కుదుర్చుకుని భూ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి క్రిషారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ప్రజలు, గిరిజన సంఘం అందజేసిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారన్నారు. దీంతో అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యు సదస్సులో మండలంలో జరుగుతున్న ఆక్రమణాలపైన ఆదివాసీ గిరిజన సంఘం అందజేసిన ఫిర్యాదులపై నేటికీ అధికారులు స్పందించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

25 నుండి తలుపులమ్మతల్లి తీర్థం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని తమ్మంగుల గ్రామంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు తలుపులమ్మ తల్లి తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ సలిమితి లక్ష్మయ్య తెలిపారు. ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ తీర్థ మహోత్సవంలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి పది గంటల వరకు కుంకుమ పూజ, హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు సినీ డూప్స్, రెండో రోజు సూర్య అబ్బాయి ఈవెంట్స్, మూడో రోజు రోజు చంటి ఈవెంట్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిది

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో బాల్య వివాహాలు, టీనేజీల ప్రెగ్నెన్సీలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి జిల్లా జిసిడిఒ, ఏజెన్సీలోని అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పోలీసు అధికారులు, ఎన్జీవోల ప్రతినిధులతో బుధవారం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీనేజీ ప్రెగ్నెన్సీలు, బాల్య వివాహాలు నిర్మూలించే విధంగా గ్రామ సచివాలయాల పరిధిలో అందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెలవుల్లో బాలికలు ఇళ్లకు వెళ్ళినప్పుడు ఈ విషయాలపై బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. టీనేజీ ప్రెగ్నెన్సీలు జరగకుండా అమ్మాయిలకు మహిళ టీచర్లు, అబ్బాయిలకు జెంట్స్ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. 18సంవత్సరాలలోపు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి జాబితా తయారు చేసి సమర్పించాలని, వారు పాఠశాలల్లో చేర్చడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీలో విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత ఐసిడిఎస్ అధికారులకు, పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల రానున్న రోజుల్లో ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడతారన్నారు. బాలికలకు చదువు, డ్రాయింగ్, స్పోర్ట్స్‌పై దృష్టి పెట్టే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సిహెచ్.శ్రీనివాసరావు, వేణుగోపాల్, కె.సూర్యనారాయణ, కరక సత్యనారాయణ, పి.రామకృష్ణ, బాలాజీ, ఏఎస్.సత్యనారాయణ, డిటిలు ఎన్‌వి సత్యనారాయణ, ఎంపీడీవోలు యస్.శ్రీనివాసరావు, కెఆర్.విజయ, మడకం బాపన్న దొర, యాదగిరి, ఈశ్వరరావు, ఎంఇఒలు రామకృష్ణ, బాపన్న దొర, తాతబ్బాయి దొర, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, టి.సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ

21న వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి -సీలేరు

సిఐ వర ప్రసాద్

మండల కేంద్రం జీకే వీధి పంచాయతీ పరిధి చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారంలో ఈనెల 21న మెగా వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జికె.వీధి సిఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మెగా వాలీబాల్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో 25 జట్లు పాల్గొంటాయని చెప్పారు. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి ఇవ్వబడుతుందని తెలిపారు. క్రీడాకారులకు ఉచితంగా వాలీబాల్ కిట్లు అందజేస్తామన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-గంగవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పిఒ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పిహెచ్‌సికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త పరీక్షలు చేసి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని సూచించారు. ఆసుపత్రికి ప్రతి రోజూ ఎంత మంది అవుట్ పేషెంట్లు వస్తున్నదీ? ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నది ఆరా తీశారు. రోగులకు అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు స్వామి, ఆర్ఐ టి.లక్ష్మణ్. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాటలతో చదువు నేర్పించాలి

రంపచోడవరం : ఏజెన్సీలోని ప్రతి అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం మండలం రంప గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారులతో ప్రాజెక్ట్ అధికారి ముచ్చటించారు. అంగన్వాడీ కేంద్రంలో ఎంతమంది బాలబాలికలు, గర్భిణులు, బాలితలు ఉన్నది, వారికి ఏయే సేవలు అందిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రానికి గుడ్లు, పాలు, బియ్యం, నిత్యవసర వస్తువులు వెండర్లు ఏ విధంగా సరఫరా చేస్తున్నారో ఆరా తీశారు.

గంగవరం పిహెచ్‌సిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

అగ్ని ప్రమాదంలో జీడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెంలో బుధవారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో జీడి మామిడి తోటలు దగ్ధమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో జీడి తోటల్లో మంటలు వ్యాపించి గ్రామానికి చెందిన పల్లాల అబ్బాయిరెడ్డికి చెందిన మూడున్నర ఎకరాలు, పల్లాల పద్మది ఎకరంన్నర, పల్లాల లక్ష్మమ్మది అర ఎకరం, పల్లాల శ్రీనివాసరెడ్డిది అర ఎకరం, పల్లాల వీరపరెడ్డిది అర ఎకరం జీడి తోటలు కాలిపోయాయి. జీడి తోటలకు వర్షాకాలంలో ఎరువులు వేసి, డిసెంబర్ నెల నుండి క్రిమిసంహారక మందులు, పూత మందులు పిచికారీ చేశామని, పంట చేతికి వచ్చే సమయంలో ఇలా కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు వాపోయారు. పెట్టుబడులు కోసం చేసిన అప్పులు చేశామన్నారు. మొత్తంగా ఆరున్నర లక్షల రూపాయల మేరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం తమకు ఏదో రూపంలో నష్టాన్ని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలిపోయిన జీడి తోట వద్ద బాధిత రైతు

మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ గౌస్ విద్యాసాగర్

ఉపాధి హామీలో అవకతవకలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి- హుకుంపేట:-పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకం అమలులో అవకతవకలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌస్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 52 కోట్ల రూపాయలతో ఉపాధి హామీ పనులు జరగ్గా మరొక 50 కోట్ల పనులు జరగవలసి ఉందని పేర్కొన్నారు. మండలంలో బూర్జ పంచాయితీ మొదటి స్థానం అత్యధికంగా పనులు జరిగాయని తెలిపారు. జిల్లాలోనే హుకుంపేట మండలానికి ఉపాధి హామీ పనులలో ప్రత్యేకమైన స్థానం ఉందని, దానిని కాపాడుకొనడం కోసం అందరూ ఎక్కువ శ్రమించవలసి ఉంటుందని చెప్పారు. గ్రామాలలో నిరుపేద రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం కోసం ఉపాధి హామీ పనులు ఎంతగానో ఉపయోగపడుతుందని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పై ఎటువంటి తప్పుడు ఆరోపణలు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజబాబు, ఎంపీడీవో రమాదేవి విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, అరుకు క్లస్టర్ ఏపీ పవన్ కుమార్, ఏపీ లింగమూర్తి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి రాజు, టెక్నికల్ డిఆర్పి పి షణ్ముఖ ,తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వీధి దీపాల వెలుగులు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వీదుల్లో ఏర్పాటు చేసిన వీధిదీపాలు మిట్ట మధ్యాహ్నం కూడా వెలుగుతున్నాయి. మండల కేంద్రంలో 24 గంటలు వీధి దీపాలు వెలుగుతుండటంపై పలువురు ఆశ్యర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వీధి బల్బులు వెలగకపోతే వెంటనే వేరే బల్బులు అమర్చే అవకాశం ఉండదు. దీంతో రాత్రుల్లో చిమ్మ చీకటిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రులో చిమ్మ చీకటిగా ఉంటుండడంతో ఇరుగు పొరుగు గృహాలకు వెళ్లడానికి స్థానిక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో మాత్రం వీధి దీపాల నిర్వహణకు చర్యలు తీసుకోలేదని స్థానికులు అంటున్నారు. తక్షణమే సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వెలుగుతున్న లైటు

గంజాయి నిర్మూలనకు కృషి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలో గంజాయి నిర్మూలనకు సంబంధిత శాఖలన్నీ కలసి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన ఎన్కార్డ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ద్వారా డ్రోన్ల సహాయంతో గత 20 సంవత్సరాల డాటా ఆధారంగా సుమారు 82 ఎకరాలలో గంజా సాగును గుర్తించడం జరిగిందని, ఆయా రైతులను గుర్తించి గంజాయితో కలుగు నష్టాలు, దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని ఆదేశించారు. డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఎస్హెచ్‌జిల ద్వారా అవగాహన కల్పించాలని, శిక్షణలు అందజేసి ఉపాధి కల్పించాలన్నారు. జూన్, జూలై నెలలలో గంజాయి సాగుకు అనుకూలంగా ఉంటుందని, ఇప్పటి నుండే ఆ దిశగా చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్ళించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలలులో విద్యార్థులకు గంజాయి నియంత్రణ పై అవగాహనా కల్పించి తల్లిదండ్రులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి వినియోగిస్తున్న విద్యార్థుల డాటా సిద్ధం చేయాలన్నారు.

ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ విధానం ద్వారా గంజాయి సాగవుతున్న ప్రాంతాలు, పండిస్తున్న రైతుల వివరాలు సులభంగా గుర్తుపట్టడం జరుగుతుందని తెలిపారు.ఆయా గ్రామాలలో గ్రామ సభలు పెట్టుకుని గ్రామాల మీదుగా గంజాయి రవాణాను నివారించాలని సూచించారు. అందుకు కమ్యూనిటీ ఆపరేటేడ్ పోస్ట్ (చెక్ పోస్ట్) ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి రైతులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించి ఫిర్యాదులనైనా టోల్ ఫ్రీ నంబర్ 1972 కు ఫోన్ చేసి చెప్పవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్య అధికారి పి. బ్రహ్మాజిరావు, జిల్లా వైద్య అధికారి జమాల్ బాష, డిసిహెచ్ఎస్ కె. లక్ష్మి, , స్త్రీ శిశు సంక్షేమ అధికారి ఎన్. సూర్యలక్ష్మి, ఎల్‌డిఎం మోతు నాయుడు పాల్గొన్నారు....

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రైతులకు వ్యవసాయ రుణ పరపతి పెంచండి

పాడేరు: వచ్చే ఖరీఫ్ సాగుకు రైతులకు రుణ పరపతి పెంచి పెద్ద ఎత్తున రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వ్యవసాయానుబంధ శాఖల అధికారులతో డిసెంబరు త్రైమాసిక జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ నాటికి రైతులకు రుణాలు అందించి వ్యవసాయనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు సహకారం అందించాలని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.672 కోట్లు రుణ లక్ష్యంగా నిర్దేశించంగా డిసెంబరు త్రైమాసకానికి రూ.607 కోట్ల రుణాలను అందించారని అన్నారు. ఇంకా రూ.90.43 కోట్ల రుణాలను అందించాలని చెప్పారు. బ్యాంకింగ్ లావా దేవీలపై బిసిలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులకు గొర్రెలు, మేకలు కొనుగోలుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని పశు సంవర్థక శాఖ అధికారులకు సూచించారు. విశ్వకర్మ పథకంలో 274 దరఖాస్తులు రాగా 42 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేసారని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారి పి.నరేష్, ఎల్ డి ఎం మాతు నాయుడు, నాబార్డు డిడి ఎం.చక్రధర్, ఎపిజివిబి రీజనల్ మేనేజర్ ఎస్. సతీష్ చంద్ర, సిడ్బీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, ఎస్బి ఐ మేనేజర్ జి.కామేశ్వరరావు, ఐఓబి మేనేజర్ ఎండి ఖాజామెయినుద్దీన్, యూకో బ్యాంకు మేనేజర్ పి.పవన్ వెంకట్ జిల్లా వ్యవసాయాధికారి ఎన్.బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, జిల్లా సెరీ కల్చర్ అధికారి అప్పారావు, పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు నరసింహులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

పాడేరు: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డైరీని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ బుధవారం ఆయన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సర్వీసెస్ సంబంధించిన ఉత్తర్వులు, నిబంధనలు, జి ఓ లు డైరీలో పొందుపరచడం పట్ల అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే పద్మలత, ఏపీ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ వి.త్రినాధరావు, బి.శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెం డెంట్‌లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో కమాండెంట్

గ్రామంలో సౌకర్యాల కల్పనకు కృషి

సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత

ప్రజాశక్తి-చింతపల్లి:కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్) ఆధ్వర్యంలో మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న చుంచుంపూడి గ్రామాన్ని సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వినీత దత్తత తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆమె గిరిజనులకు హామీ ఇచ్చారు. గ్రామంలో విద్యతోపాటు తాగునీటి సౌకర్యం వంటి వసతల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేపడతామన్నారు.విద్యావంతులైన వారిని గుర్తించి ఉన్నత విద్యను అందించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించి విద్య బోధన అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని, నాటు సారా తయారీ, విక్రయాలు, చేయకూడదని, ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యవంతులుగా ఉండాలని గిరిజనులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డైలీ నగర్ గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 30న నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాడేరు ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కె సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల రాసిన విద్యార్థులు కూడా ఏపీ పాలిసెట్ కు దరఖాస్తు చేసుకో వచ్చునని ఆమె తెలిపారు. ఏప్రిల్ 15 వరకు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందని ఆమె వెల్లడించారు. పాడేరు పాలిటెక్నిక్ లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కేంద్రం ద్వారా అభ్యర్థుల నుంచి ఏపీ పాలీసెట్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్, ఆధార్ జిరాక్స్, కలర్ పాస్పోర్ట్ తో పాటు మొబైల్ ఫోన్ తీసుకొని తమ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పది పరీక్షలు ముగిసిన వెంటనే తమ పాలిటెక్నిక్ లో నిర్వహించనున్న పాలిసెట్ శిక్షణ కార్యక్రమానికి కూడా హాజరు కావచ్చునని తెలిపారు. అభ్యర్థులు ఎస్సీ ఎస్టీలకు పరీక్ష ఫీజు వంద రూపాయలు, ఓసి, బీసీ అభ్యర్థులు 400 రూపాయలు చెల్లించాలని తెలిపారు.

దుంబ్రిగుడ:- కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 6 ,7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలలకు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ ఎస్ఓ కే భవాని తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

మరమ్మతుకు నోచని బోర్లు

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని మఠం పంచాయతీ జాకారవలస గ్రామంలో చేతి బోర్లు మూలకు చేరాయి. వేసవికాలం కావడంతో గిరిజనుల గొంతేండుతుంది. జల్ జీవన్ మిషన్ ధ్వారా వస్తున్న ట్యాంక్ నీరు పూర్తి స్థాయిలో రానందున, రెండు రోజులకు ఒక సారి గ్రామస్తులు తాగు నీరు పట్టుకుని వినియోగిస్తున్నారు. ఈ గ్రామం లో 75 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. చేతి బోర్లు మరమ్మతుకు గురై ఏడాది నుంచి అలంకార ప్రాయంగా మారాయి. చేతి బోర్లు ను తక్షణమే మరమత్తులు చేసి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండలంలోని జోలాపుట్టు జడ్పీ హైస్కూల్, ముంచింగిపుట్టు బాలురు 1, బాలికలు 1లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి పరీక్ష కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర నియమించామన్నారు. జోలాపుట్టు పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చి, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ నాగభూషణ్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చింతపల్లి : రైతులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఉపయోగించటంతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి మధుసూదనరావు తెలిపారు. బుధవారం ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి మండల పరిషత్ కార్యాలయం అవరణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేంద్రీయ ఉత్పత్తులు క్రయ విక్రయాలు చేసేందుకు ప్రత్యేక వెబ్సైటు ఉందన్నారు. రైతు సహకార సంఘాలు ద్వారా ఉత్పత్తులను సమిష్టిగా విక్రయించవచ్చునని తెలిపారు. రైతు సహకార సంఘాల సహకారంతో మార్కెటింగ్, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లతో ఒప్పందం చేసుకుని క్రయవిక్రయాలు సులభతరంగా ఉంటుందన్నారు. రైతులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులను నేరుగా వినియోగ దారులకు విక్రయించేందుకు దోహదపడుతుందన్నారు. ఉత్పత్తుల నాణ్యతను బట్టి సరైన ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ సీఎన్ ఎఫ్ జె.వెంకటరమణ, చింతపల్లి, అన్నవరం యూనిట్ ఇన్చార్జిలు కొర్ర మోహన్, కిలో మోహన్, ఉల్లి సత్యనారాయణ, మువ్వల రంగారావు, గడుతూరి బొజ్జి పడాల్, రెడ్డి విజయ్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు

పోటీ అభ్యర్థుల తుది జాబితా వెల్లడి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల నామినేషన్ పర్వం ముగిసింది. బుధవారం సాయంత్రం పరిశీలన పూర్తయ్యాక పోటీల బరిలో నిలిచిన అభ్యర్థుల చివరి జాబితాను బుధవారం సాయంత్రం ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి ,ఉప ఎన్నికల అధికారి సిబిఎస్ లింగరాజు ప్రకటించారు. అధ్యక్ష కార్యదర్శి పదవులకు ముగ్గురు వంతున పోటీలో ఉన్నారు వివిధ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు గెలుపు గుర్రాల కోసం ప్రచారం ముమ్మరంగా సాగించారు. సుమారు 2, 800 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నట్లు అధికారులు చెప్పారు.

అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు ఎంకె శ్రీనివాస్, ఐ ఎం ఆహమ్మద్, నమ్మి సన్యాసిరావులు పోటీలో ఉన్నారు. కీలకమైన కార్యదర్శి పదవికి ఎల్పి. నాయుడు, రాపేటి సూర్యనారాయణ, ఏవి సోమేశ్వరరావు, వి వెంకట సుధాకర్ రావు పోటీ చేస్తున్నారు. 28న న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరగనుండగా, వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి రాత్రికి ఫలితాలను వెల్లడిస్తారు. నోటిఫికేషన్ రాకముందు నుంచే ప్రచారం చేపట్టిన పలువురు అభ్యర్థులు, ఇపుడు తుదిజాబితా వెల్లడి కావడంతో ప్రచారం ముమ్మరం చేశారు

బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలనడం సరికాదు

ప్రజాశక్తి-కొయ్యూరు : బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు మాట్లాడటం సరికాదని ఆదివాసీ జెఏసి నాయకులు అశోక్ లాల్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎపి అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి రాష్ట్రంలో 50 లక్షల మంది ఉన్న బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాట్లాడటం, తెలంగాణలో ఉన్న 5 లక్షల మందిని ఎస్‌టి జాబితాలో చేర్చాలని అదే పార్టీకి చెందిన ఎంపీ డీకే అరుణ మాట్లాడటం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఆదివాసీ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, దానిని ఏనాడూ పట్టించుకోని వారు అభివృద్ధి చెందిన కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరడం దుర్మార్గమన్నారు. ప్రజాప్రతినిధుల చర్యల వల్ల ఆదివాసీలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలి ఒకరు, పక్కా గృహాలు మంజూరు చేయాలని మరొకరు మాట్లాడుతున్నారని, ఆదివాసీ హక్కులపై కనీస అవగాహన లేని ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం గిరిజనుల దౌర్భాగ్యమని అశోక్‌లాల్ పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీలేరు : జికె వీధి మండలం సీలేరులోని అభయాంజనేయస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

టెన్త్ పరీక్షా కేంద్రం పరిశీలన

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండల కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను మండల తహశీల్దారు టి.రామకృష్ణ బుధవారం పరిశీలించారు. పరీక్షలకు విద్యార్థుల హాజరు శాతం గురించి పరీక్షల ముఖ్య నిర్వహణాధికారి కుప్ప పోతురాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రచారం

తల్లిదండ్రులకు కరపత్రాలను ఇస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-సీలేరు : పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన తరువాత విద్యార్థులు జీకే వీధి మండలం సీలేరు జూనియర్ కళాశాలలో సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో చేరాలని ఆ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్ తదితరులు బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. సీలేరులోని పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద పరీక్ష అయిపోయి విద్యార్థులు బయటకు వచ్చే సమయంలో వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. సిఇసి హెచ్ఇసి గ్రూపులో చదివితే ఐఎఎస్, ఐపిఎస్, ఏపీపీఎస్సీ పరీక్షలు రాయడానికి దోహదం చేస్తాయని చెప్పారు. జూనియర్ కళాశాలలో చేరిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రూ.15000 అకౌంట్‌లో జమ చేస్తుందని తెలిపారు. అనుభవమైన అధ్యాపకులచే డిజిటల్ తరగతులు నిర్వహణ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు బ్యాగులు ఇస్తుందన్నారు. ఏపీఆర్‌డిసి, డైట్ సెట్, ఇతర పోటీ పరీక్షలకు జీకేపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం కూడా ఉందని, ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంటు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫోటోలు, టెన్త్ క్లాస్ హాల్ టికెట్, టీసి, మార్క్స్ మెమో సమర్పించి ఇంటర్ బోర్డు నిర్దేశించిన ఫీజు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

సిగ్నల్స్ లేక హౌసింగ్ సర్వేకు ఇబ్బందులు

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్, నెట్‌వర్కు సక్రమంగా పనిచేయకపోవడంతో హౌసింగ్ సర్వే చేయడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానిక సర్పంచ్ పాంగి దుర్గో ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొన్ని నెలలుగా బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ నెట్ సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అయినా బిఎస్ఎన్ఎల్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. బుధవారం పంచాయతీ పరిధిలోని చంద్రుపల్లి హౌసింగ్ సర్వే చేయడానికి వచ్చిన సిబ్బంది సిగ్నల్స్ లేక కొండపైకి వెళ్లి హౌసింగ్ సర్వే చేయవలసిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇదే తరహాలో సమస్యలు ఎదురైతే హౌసింగ్ సర్వే మరింత జాప్యం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సెల్ సిగ్నల్స్ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


కొండపైకి వెళ్లి హౌసింగ్ సర్వే చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న గొడుగులమ్మ గ్రామస్తులు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం, మంప పంచాయతీ పరిధి గొడుగులమ్మ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన మర్రి సత్తిబాబు, సాంబడు బుధవారం ఎంపిడిఒ ఎస్‌కెవి.ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 20 మంది చిన్నారులు, నలుగురు కిశోర బాలికలు, గర్భిణులు ఉన్నారని తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్.దొడ్డవరం వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో చిన్నారులు అంగన్వాడీ సేవలు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చలికాలం, వేసవికాలంలో ఏదోలా ఆ గ్రామానికి వెళ్లి వస్తున్నా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు.

నేటి నుండి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-గంగవరం : అంగన్వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం నుండి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్.లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్స్ ఈ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు,.

ఈ శిక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో ఇసిసిఇ పూర్వ ప్రాథమిక విద్య మెరుగుదలతో పాటు పౌష్టికాహార వినియోగంపై కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణా తరగతులకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

వారపుసంతలో ర్యాలీ చేస్తున్నగిరిజనులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన గరిమండ వారపు సంతలో బుధవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. వారపు సంతకు వచ్చిన పలు గ్రామాల గిరిజనులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మావోయిస్టు వారోత్సవాలు వద్దు, గిరిజనుల అభివృద్ధే ముద్దు అంటూ నినాదాలు చేశారు.

ఉగాది జాతర కేలండర్ ఆవిష్కరణ

ఉగాది జాతర కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని సీతపల్లి మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి విశ్వావసు నామ సంవత్సర ఉగాది జాతర మహోత్సవాలకు సంబంధించిన కేలండర్‌ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ ఆవిష్కరించారు. ఈ నెల 25 నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులు ఈ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ గండేపూడి సత్య రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పండా బాబి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

మండుతున్న ఎండలకు మధ్యాహ్న వేళల్లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండల తీవ్రత పెరగడంతో ఉక్కపోత ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడగాల్పులు తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాడీ డిహైడ్రేషన్‌కి గురికాకుండా చూసుకోవాలని, ఎండలో ఎక్కువసేపు ఉండవద్దని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. దాహం తీరడానికి పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల, మజ్జిగ తాగాలని సూచించారు.